# భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు



ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**వీరఘట్టం:** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మార్గశిరమాసంలో వచ్చిన ఈ ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం చేశారు.

**పాలకొండ:** ధనుర్మాసం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవ ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. ప్రాతఃకాలం నుంచి ఆలయాల వద్ద భక్తుల రద్దీ మొదలైంది. స్థానిక శ్రీకోదండరామాలయం, సీతారామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణస్వామి తదితర ఆలయాల్లో స్వామివారు ఉత్తర ద్వారదర్శనం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, పెదబ్రి [illegible]చార్యులు, సీతారాంజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ప్రశాంతంగా నవోదయ పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**వీరఘట్టం:** స్థానిక జడ్పీ బాలురు, బాలికల హైస్కూల్స్‌లో ఆదివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బాలుర హైస్కూల్‌లో 180 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరు అయ్యారని అధికారులు తెలిపారు. ఈపరీక్షల్లో హెచ్‌ఎంలు ఎం.వి.నర్సింగరావు, నాగమణి, డిపార్టుమెంట్ అధికారులుగా టి.కృష్ణమూర్తి, జామి రవి, టీఎల్‌వోలుగా విజయకృప, అరుణ్ కుమార్‌లు వ్యవహరించారు. మండల ప్రత్యేకాధికారి వై.వి.శ్యామ్ కుమార్ అబ్జర్వర్‌గా తనిఖీలు జరిపారు.

**పాలకొండ రూరల్:** పట్టణంలో ఆదివారం నిర్వహించిన నవోదయ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, వివేకానంద హైస్కూల్స్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌లలో 527మంది విద్యార్థులు నవోదయ ప్రవేశపరీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 227 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వివేకానంద హైస్కూల్‌లో 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈపరీక్షలకు చీఫ్ సూపరింటిండెంట్‌గా వి.వి.రాజు, ఎం.సూర్యనారాయణలు వ్యవహరించారు. డిపార్టుమెంటల్ అధికారులు ఎం.వి.ప్రసాదరావు వ్యవహరించారు. నవోదయ అబర్జర్వర్ జి.చిన్నంనాయుడు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బాలాజీప్రసాద్‌లు పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

# జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు తెట్టంగి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**వీరఘట్టం:** మండలం తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అల్లు గౌరీశంకరరావు జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబర్ నెలలో శ్రీకాకుళం కోడిరామమూర్తి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో గౌరీశంకర్ చక్కని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి అర్హత సాధించాడు. ఈయన ఎంపిక పట్ల పీఈటీ టి.వి.శ్రీనివాస్, హెచ్‌ఎం డి.బాలరాజు, ఎం.వి.కామేశ్వరరావు తదితర ఉపాధ్యాయ సిబ్బందితోపాటు సర్పంచ్ ప్రతినిధి వండాన భానుబాబు, వంజరాపు రమేష్‌కుమార్, వండాన కృష్ణకుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వంజరాపు రమేష్ కుమార్ తన సొంత నిధులతో పాఠశాలలో క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.

# ప్రజా సమస్యలపై సమీక్ష

**భామిని:** జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం మధ్యాహ్నం రెండుగంటలకు సమీక్ష నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.గోపాలరావు తెలిపారు. దీనికి సంబంధించి రేషన్‌కార్డులు, ధాన్యం కొనుగోలు లేకపోవడం, మీసేవ సమస్యలపై సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

# చంద్రన్నకానుకల పంపిణీ

**పాలకొండ రూరల్:** స్థానిక నగర పంచాయతీ పరిధిలో 17వ వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుమ్మిడి సింహాద్రి చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోట్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.